

ప్రజాపాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారు
● ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్
8

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- జిల్లాలో 1,23,144 ఇళ్లకు నీటి సరఫరా
- ఎప్పటికప్పుడు మరమ్మతు
- మిషన్ భగీరథ నీరే సురక్షితం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మిషన్ భగీరథ (ఇంట్రా) గంగాధర శ్రీనివాస్



పెద్దపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజల కు వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుం టున్నామని మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ గంగాధర శ్రీనివాస్ పేర్కొన్నా రు. జిల్లాలోని 1,23,144 ఇళ్లకు రోజు నీటి సరఫరా చేస్తున్నామని, మరికొన్ని గ్రామాలకు నీళ్లు ఇచ్చేందుకు పనులు చేపట్టామన్నారు. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, వాటర్ ప్లాంట్ల నీళ్ల కంటే మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే నీళ్లలోనే అధిక లవణాలు ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి సురక్షమని స్పష్టం చేశారు. ఆయనతో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎన్ని నివాసాలకు నీళ్లు ఇస్తున్నారు?

ఈఈ: జిల్లాలో 266 గ్రామ పంచాయతీల్లోని 425 ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా 1,23,144 ఇళ్లకు నల్లాల ద్వారా రోజూ నీరంది స్తున్నాం. ఒక్కో ఇంటికి 400 లీటర్ల చొప్పున 55 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నాం. 637 ఓవర్ హెడ్ ట్యాంకులకు మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి నీళ్లు సరఫరా అవుతున్నాయి. 3,907 బోర్లు, 604 సింగిల్ ఫేజ్ మోటా ర్లు గల బోర్లు, 513 త్రీఫేజ్ మోటారు బోర్లు, 306 బావులు కూడా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో అన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉన్నాయా?

ఈఈ: మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించినప్పుడు 1,24,086 గృహాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. కొన్ని ప్రాం తాల్లో ఆవాసాలు దూరం ఉండడం వల్ల 942 ఇళ్లకు నల్లాలు ఇవ్వలేక పోయాం. ప్రస్తుతం ఆ నివాసాల వద్దకు పైపులైన్లు వేసి కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి నెలకొన్నదా?

ఈఈ: ఎక్కడా కూడా తాగునీటి ఎద్దడి లేదు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచే పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు, ధర్మారం మండ లాలకు మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా ఫిల్టర్ వాటర్ సరఫ రా అవుతున్నాయి. ఎక్కడైనా పైపులైన్లు డ్యామేజీ, లీకేజీలు అయినప్పుడు మరమ్మతు పనులు చేపట్టే వరకు తాగునీటి సరఫరా నిలిచి పోతున్నది. దానికి ప్రత్యామ్నా యంగా గ్రామాల్లో గల బావుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. ధర్మారం మండలం ఎర్రగుంటపల్లిలో 10 ఇళ్లకు నీటిని సరఫ రా లేకపోవడంతో పైపులైన్ వేసి నీటిని సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: బుధవారంపేట పరిధిలోని తెనుగుపల్లికి నీళ్లు ఎందుకు రావడం లేదు?

ఈఈ: మిషన్ భగీరథ రికార్డుల ప్రకారం తెనుగుపల్లిలో 130 ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం వాటి సంఖ్య 200 ఇళ్లకు పెరి గింది. 14 లక్షల రూపాయలతో పైపులైన్లు వేసి వంద ఇళ్ల వరకు నల్లా కనెక్షన్లు ఇచ్చాం. మిగతా ఇళ్లకు కూడా నల్లా కనెక్షన్లు ఇచ్చి నీటిని సరఫరా చేస్తాం.

ఆంధ్రజ్యోతి: మంథని ప్రాంతంలో పనులు పెండింగులో ఉన్నాయి?

ఈఈ: మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి, పాలకుర్తి మండ లాల్లో పలు గ్రామాల్లో 26 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించాం. పైపులైన్లు లేక అక్కడ నీటి సరఫరా చేయలేక పోతున్నాం. ఈ విషయమై కలెక్టర్ ప్రత్యే క చొరవ తీసుకుని రూ.4.80 కోట్లు మంజూరు చేశారు. ఏప్రిల్ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి ఆ గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఎస్‌డీఎఫ్ కింద ఎన్ని పనులు చేపట్టారు? గత ఏడాది పనులకు బిల్లులు ఎందుకు రావడం లేదు?

ఈఈ: గత ఏడాది ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఎస్‌డీఎఫ్ కింద ఇచ్చిన నిధుల్లో రూ.2.88 కోట్లు తాగునీటి పనులకు కేటాయించారు. 61 పనులు చేపట్టాం. వాటిలో 42 పనులు పూర్తి కాగా, మిగతా పనులు ప్రగతిలో ఉన్నాయి. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద గతేడాది 185 క్రిటికల్ గ్యాప్స్ పనులకు రూ.1.83 కోట్లు మంజూరు చేశారు. ఇందులో 175 పనులు పూర్తయ్యాయి. బిల్లులు ఆన్‌లైన్ చేశాం. తమ వద్ద పెండింగులో లేవు.

ఆంధ్రజ్యోతి: తాగు నీటి సమస్య తలెత్తినప్పుడు ఎవరిని సంప్రదించాలి?

ఈఈ: టోల్ ఫ్రీ నంబర్ 18005994007 హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే తమకు సమాచారం ఇస్తారు. తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ఇప్పటి వరకు సబితం, పొట్యాల, ధర్మారం చెందిన పలువురు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్లు చేస్తే సమస్య పరిష్కరించాం.

ఆంధ్రజ్యోతి: మిషన్ భగీరథ వాటర్‌ను అందరూ వినియోగిస్తున్నారా?

ఈఈ: మొదట్లో మిషన్ భగీరథ వాటర్‌ను వినియోగించేందుకు చాలా మంది ఇబ్బందిపడ్డారు. గ్రామాల్లో అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వ హించాం. ఆర్‌వో వాటర్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, వాటర్ ప్లాంట్ల వాటర్ ఆరోగ్యానికి హాని చేస్తాయి. శరీరానికి సరిపడా లవణాలు అందులో ఉండవు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రకారం 100 నుంచి 500 శాతం టీడీఎస్ ఉండాలి. మిషన్ భగీరథ నీటిలో 250 నుంచి 300 శాతం వరకు లవణాలు ఉండగా, వాటర్ ప్లాంట్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్, ఆర్‌వో ప్లాం ట్ల వాటర్‌లో 25 నుంచి 40 శాతం వరకే లవణాలు ఉన్నాయి. ఆ నీటిని మా ల్యాబ్‌ల్లో పరీక్షిం చాం. డబ్బులు పెట్టి ఆ వాటర్‌ను కొని అనా రోగ్యం పాలవుతున్నారు. ఆ వాటర్ తాగడం వల్ల ఎముకల పటుత్వాన్ని కోల్పోతు న్నాయి. ప్రతీ ఒక్కరికి మిషన్ భగీరథ నీరే సురక్షితం అని గ్రహించాలి. ఆ దిశగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

కలర్‌ఫుల్ జోష్

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం ఉదయం నుంచే యువత పలు రంగులతో సందడి చేశారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు హోలీ సందడి కనిపించింది. మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు వేడుకల్లో భాగస్వాములు అయ్యారు. వివిధ వాడల్లో డీజే సౌండ్ల మధ్య నృత్యాలు చేశారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ రంగులు చల్లుకోవడంతో సందడి వాతావరణం ఏర్పడింది

8


హోలీ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, సీపీ ఇంద్రసేనారెడ్డి


సీపీ అంబర్ కిశోర్ ఝాను ఎత్తుకున్న పోలీస్ అధికారులు, సిబ్బంది


పెద్దపల్లిలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ యువకుల హోలీ సంబరాలు


సీపీకి బొట్టు పెడుతున్న మహిళా సిబ్బంది


హోలీ వేడుకలో మహిళలు


ధర్మారంలో హోలీ వేడుకలు


కాలనీలో హోలీ వేడుకలు

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే..



- 25 శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- ఈ నెలాఖరు వరకు గడువు
- ఇప్పటి వరకు 691 ప్లాట్ల క్రమబద్ధీకరణ
- ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పెంచాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అనధికారిక లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ కార్యక్రమానికి దరఖాస్తుదారుల నుంచి అంతంత మాత్రంగానే స్పందన వస్తున్నది. ఈ నెలాఖరు వరకు ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించినా స్పందన అంతంతమాత్రంగానే ఉంది. అధికార యంత్రాంగం చేస్తున్న విస్తృత ప్రచారం వల్ల ఇప్పుడిప్పుడే దర ఖాస్తుదారుల్లో అవగాహన కలుగుతున్నది. రాయితీ గడువు తేదీని ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తేనే ఖజానా నిండే అవకాశాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 25,513 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 691 మంది మాత్రమే తమ ప్లాట్లను క్రమబద్ధీకరిం చుకునేందుకు రుసుం చెల్లించారు. పట్టణాల్లో 585 మంది, గ్రామాల్లో 106 మంది రుసుం చెల్లించారు.

పట్టణాలు, మండలాల్లో దరఖాస్తుదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా కూడా అధికారులు ఊహించినంత మేరకు ముందు కు రావడం లేదు. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో పంచాయతీల్లో 5,735, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 7,078, మంథని మున్సి పాలిటీలో 895, పెద్దపల్లి మున్సిపాలిటీలో 10,269, సుల్తానా బాద్ మున్సిపాలిటీలో 1,536 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన అధికారులు 4,251 దర ఖాస్తుల కు సంబంధించిన ఓపెన్ ప్లాట్లు గల భూములు రెవెన్యూ రికార్డుల్లో నిషేధిత జాబితాల్లో ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 16,910 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. ఇంకా 3,568 దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాల్సి ఉంది. ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నా దరఖాస్తు దారులు త్వరగా ముందుకు రావ డం లేదు. మరోవైపు.. ఎల్‌ఆర్‌ఎస్ చేయ కుండా విక్ర యించే ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపి వేశారు. తద్వారా కొంత మేరకు ఎల్‌ఆర్‌ఎస్ కోసం కొంత మంది ముందుకు వస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం..

రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నిండుకోవడంతో ఎల్‌ఆర్ ఎస్ ద్వారా కొంత ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని భావించిన ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ రుసుంలో 25 శాతం రాయితీ ప్రకటించింది. అంతేగాకుండా కొత్త గా కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2020, ఆగస్టు 26 లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమానులు, ప్లాటు ఓనర్లకు ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించిన ట్లు ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీల న వేగవంతం చేయాలని వేగిర పెట్టినా కూడా ఎవరు కూడా రుసుం చెల్లించేందుకు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నది. అవగా హన సమావేశాలు నిర్వహించడంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పట్టణాల్లో మైకుల ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు. కరపత్రాలు ముద్రించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే అనుమతులు

ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటేనే భవన నిర్మాణా లకు సులువుగా అనుమతులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. మార్కెట్ విలువను తాజా మార్కెట్ ధర కంటే డాక్యుమెంట్ విలువ ఆధారంగా అంచనా వేస్తా రని, తద్వారా యజమా నులకు ప్రయోజనం కలగ నున్నదని చెబుతున్నారు. బ్యాంకు లోన్ ప్రాసెసింగ్ సమయంలో ప్రయోజనా లకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఎల్‌ఆర్ ఎస్ లేకుంటే భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు 33 శాతం జరిమానా చెల్లించాల్సి వస్తుందని, తమ ప్లాటును ఇతరులకు విక్రయించేటప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ ఉంటే సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగినప్పుడు 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు కూడా పెరుగుతాయని, ఇప్పుడే ఎల్‌ఆర్‌ఎస్ చేయడం వల్ల భారీ మొత్తంలో డబ్బు ఆదా అవుతుందని, ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడిం గులు పొందితే తమ ప్లాటుకు చట్టబద్ధంగా అధికా రం పొందిన ట్లేనని అధికారులు ప్రచారం చేస్తు న్నారు. దీంతో కొంత మేరకు దరఖాస్తుదారుల్లో ఆలోచనలు ఇప్పుడిప్పుడే మొదలవు తున్నాయి. గడువు తేదీ సమీపిస్తుండడంతో పలువురు మున్సిప ల్, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లి రుసుం ఎంత అవుతుందని ఆరా తీస్తున్నారు. 25 శాతం రాయితీ పొందేందుకు మార్చి నెలాఖరు వరకు ఇచ్చిన గడువు ఏమాత్రం సరిపోదని, దీనిని ఏప్రిల్ నెలాఖరు వరకు పెంచాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కష్టపడి చదివి గ్రూప్ పరీక్షల్లో సత్తాచాటి

- గ్రూప్ -2లో 143, గ్రూప్ 3లో 21వ ర్యాంకు
- గ్రూప్-4 ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం


మహేష్ గౌడ్

ముత్తారం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితే ఫలితాలు సంతృప్తికరంగా ఉంటాయని సీతంపేట గ్రామానికి చెందిన గంట మహేష్ గౌడ్ నిరూపించారు. గ్రూప్ పరీక్ష ఏదైనా మెరుగైన ర్యాంక్ సాధిస్తున్నా డు. గ్రూప్ -4 ద్వారా జూనియర్ అసిస్టెంట్‌ గా ఉద్యోగం చేస్తున్న మహేష్‌గౌడ్ ఇటీవల విడుదలైన గ్రూప్-2లో 143వ ర్యాంకు సాధిం చాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్-3లో 21వ ర్యాంకు సాధించాడు. మహేష్ గౌడ్ ఇంటర్మీడియట్‌లో డివిజన్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. బీటెక్ జేఎన్టీయూ మంథనిలో పూర్తిచేసి చేశాడు. బీటెక్ పూర్తవగానే మైనిం గ్ ఇంజనీర్‌గా ఛత్తీస్‌గఢ్, వెస్ట్ బెంగాల్‌లో కోల్ ఇండియాలో విధులు నిర్వహిస్తూ యూపీఎస్సీకి ప్రిపేరయ్యాడు. యూపీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఇంజనీరింగ్ ఉద్యోగా నికి రిజైన్ చేసి బెంగళూరులో కోచింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ ప్రిపేర్ అయ్యే సమయంలో తండ్రి మరణం, 2019లో టీఎస్పీఎస్సీ గ్రూప్-4 నోటిఫికేషన్ రావడంతో హైదరాబాద్‌కు వచ్చాడు. గ్రూప్-4 ద్వారా పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. గ్రూప్-2 లో రాష్ట్రస్థాయిలో 143 ర్యాంక్ సాధించడంతో డిప్యూటీ తహసీల్దార్ లేక ఎక్సైజ్ ఎస్సైగా వస్తుందని పేర్కొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల్లో అయోమయం



- మున్సిపాలిటీలో యేడాదిపాటు పొడిగిస్తూ జీవో నం.69 జారీ
- అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లో కోతలు
- సవరించాలని కోరుతున్న పారిశుధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది

కోల్‌సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖలో వెలువడు తున్న జీవోలు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని గందరగోళానికి గురి చేస్తున్నాయి. జీవో జారీ చేసే సమయంలో కనీస నిబంధనలు, ఫైల్ ప్రాసెసింగ్‌లో తప్పు ఒప్పులు చూసుకోకుండా జీవోలు జారీ అవుతు న్నాయనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న 30,955మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది సేవలను ప్రభుత్వం 01-04-2024 నుంచి 31-03-2025వరకు పొడిగిస్తూ జీవో నెం.69జారీ చేసింది. ఈ జీవోలో కార్మికుల కనీస వేతనాలకు సంబంధించి స్పష్టమైన సమాచారం లేకుండానే వివరాలు పొందు పరిచారు. పీహెచ్ వర్కర్లు, డ్రైవర్లు, జవాన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్లు, మోటార్ మెకానిక్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, తదితర సిబ్బంది వేతనాల విష యంలో గందరగోళానికి దారితీసేలా పొందుపరిచారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో సిబ్బంది పొందుతున్న వేతనాలకు 20నుంచి 25శాతం తక్కువ పొందేలా పొందుపరిచ్చారు. పీహెచ్ వర్కర్లు, డ్రైవర్లు, శాని టరీ ఇన్‌స్పెక్టర్లను ఒకే క్యాటగిరిలో చేర్చి రూ.16,600లుగా పేర్కొన్నారు. వాస్తవానికి ప్రస్తుతం డ్రైవర్లకు రూ.20,500, కంప్యూటర్ ఆపరేటర్లు 22,750, జూనియర్ అసిస్టెంట్లకు రూ.20,500 వేతనాలు పొందు తున్నారు. ప్రస్తుతం జారీ చేసిన జీవోతో డ్రైవర్లు, జవాన్లకు వేతనాల్లో రూ.3900, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.3250, జూనియర్ అసిస్టెంట్లకు రూ.1000 వేతనం తగ్గనున్నది. నాన్ పీహెచ్ వర్కర్లుగా పేర్కొన్న ఎక్స్‌కావేటర్ ఆపరేటర్లు, మోటార్ మెకానిక్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అకౌంటెంట్లు, బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల వేతనాల్లో కనిష్టంగా రూ.4వేల నుంచి గరిష్టంగా రూ.12వేల వరకు వేతనాల్లో తగ్గుదల జరుగనున్నది.

రామగుండంలో 573మందిపై ప్రభావం...

రామగుండం నగరపాలక సంస్థలో 573మంది అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తుండగా ఇందులో నాన్ పీహెచ్ క్యాటగిరిలో 121మంది పని చేస్తున్నారు. కొత్త జీవో ప్రభావం ప్రతీ కార్మికుడిపై పడనున్నది. ప్రస్తుతం పొందుతున్న వేతనాల్లో రూ.1000 నుంచి రూ.12వేల వరకు తగ్గుదల జరుగనున్నది. దీంతో కార్పొరేషన్ ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లాలోని సుల్తానాబాద్‌లో 74, మంథనిలో 78, రామగుండంలో 573, పెద్దపల్లిలో 154మంది ఉన్నారు.

గత ఏడాది ఇదే మాదిరిగా జీవో జారీ...

ఆర్థికశాఖ గత ఏడాది కూడా ఇదే రీతిలో జీవో జారీ చేసింది. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ జీవో తప్పిదంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మళ్లీ సవరించి నూతన జీవోను జారీ చేశారు. ఈ ఏడాది కూడా ఏ మాత్రం మార్పులు, చేర్పులు లేకుండా ప్రభుత్వం జీవో నెం. 69ని జారీ చేసింది. ఈ జీవోను అమలు చేస్తున్నట్లు సీడీఎంఏ పక్షాన సర్క్యులర్ కూడా జారీ అయ్యింది. ఈ జీవోపై కార్మిక సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు వినతి పత్రం అందించారు. వెంటనే జీవోను సవరించాలని, వేతనాలు పెంచాలని కోరారు.

భానుడి భగ భగ...

40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

కళ్యాణ్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మార్చి రెండవ వారంలోనే భానుడు భగభగమంటున్నాడు. శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రత 39.2, కనిష్ట ఉష్ణోగ్రత 22.7డిగ్రీలుగా నమోదైంది. 40డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరువలో ఉంది. శనివారం నుంచి ఎండలు మరింత పెరుగుతాయని వాతావరణశాఖ పేర్కొన్నది. గురువారం గరిష్ట ఉష్ణోగ్రత 38.2, కనిష్ట ఉష్ణోగ్రత 21.5, గురువారం 37.8, 20.4 నమోదైంది. మధ్యాహ్నం 12గంటలు దాటితే రోడ్లపైన జనాలు కనిపించడం లేదు. రాత్రి 7గంటలు దాటినా ఎండ వేడి తగ్గడం లేదు. కూలర్లను వినియోగిస్తున్నారు. మార్చి నెలలోనే ఎండలు దంచికొడుతుండగా ఏప్రిల్, మే మాసంలో ఎండలు ఎలా ఉంటాయోనని జంకుతున్నారు.



డయల్ యువర్ డీఎంకు సమస్యల వెల్లువ

కళ్యాణ్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్- గోదావరిఖనికి రాత్రి 8 గంటలు దాటితే బస్సులు ఉండడం లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం గోదావరిఖని డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎగ్లాస్‌పూర్, ఆకెన పల్లి, పొట్యాల రూట్‌లో బస్సుల సంఖ్య పెంచాలని, పొట్యాల నుంచి పెద్దప ల్లికి సర్వీసును ప్రారంభించాలన్నారు. మహాలక్ష్మి పథకంతో పురుషులకు సీట్లు లేకుండా పోతున్నాయని, కుమ్మరికుంటకు అదనంగా రెండు ట్రిప్పులు పెంచాలని కోరారు. కమాన్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసు నడి పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఎం నాగభూషణం తెలిపారు.

వినియోగదారుడా.. మేలుకో..

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



గణేశ్‌నగర్, మర్చి 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎన్నో హక్కులు ఉన్నాయి. ఈ విషయం తెలియక చాలా మంది ఎన్నో విధా లా నష్టపోతున్నారు. వినియోగ దారుల హక్కులను పరిరక్షిస్తూ అవగాహన కల్పించేందుకు కన్స్యూమర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మార్చి 15న జరుపుకునే ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహిస్తారు. 1983 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం థీమ్ స్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన. అన్యాయమైన మార్కెట్ విధానాలు,తప్పుదారి పట్టించే ప్రకటనలు, అసురక్షిత ఉత్పత్తుల నుంచి కొనుగోలుదారులను రక్షించడం. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా, ప్రజలు తమ హక్కుల గురించి అవగాహన కల్పించడానికి కార్యకర్తలు, సంస్థలు, ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

వినియోగదారుల హక్కుల రక్షణ కార్యక్రమాలు

భారత ప్రభుత్వం వినియోగదారులకు సాధికారత కల్పించడానికి, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. భారతదేశంలో వినియోగదారుల హక్కులను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన కొన్ని కీలక చర్యలు వినియోగదారుల రక్షణ చట్టం 2019లో పొందుపరిచారు.

- వేగవంతమైన పరిష్కారం కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను దాఖలు చేయడానికి ఈ-దాకిల్ పోర్టల్ అనే డిజిటల్ వేదికను ఏర్పాటు చేసింది.
- కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ (సీసీపీఏ) - అన్యాయమైన వాణిజ్య పద్ధతులను నియంత్రిస్తుంది, పరిష్కరిస్తుంది.
- జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్)- వినియోగదారుల ఫిర్యాదులు,సహాయం కోసం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ (1800-11-4000)

జాగో గ్రాహక్ జాగో ప్రచారం - వినియోగదారులకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించే దీర్ఘకాలిక అవగాహన కార్యక్రమం.
బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) సర్టిఫికేషన్ - వినియోగదారు వస్తువుల నాణ్యత, భద్రత కోసం ఏర్పాటు చేశారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

● పండుగపూట విషాదం


సాగర్‌గౌడ్ (ఫైల్)

జగిత్యాలరూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం వెల్దుర్తి-బావోజీపల్లె శివార్లలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఈతకు వెళ్లి గొల్లపల్లి సాగర్‌గౌడ్(32) అనేయువకుడు మృతిచెందాడు. శుక్రవారం హోలీవేడుకల్లో భాగంగా సాగర్ తన మిత్రులతో కలిసి సంబరాలు జరుపుకున్నాడు. అనంతరం గ్రామశివారులోగల ఎస్సారెస్పీ కెనాల్‌లో మిత్రులతో కలిసి స్నానం చేయడానికి వెళ్లాడు. సాగర్‌కెనాల్‌లో దూకడంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండి గల్లంతయ్యాడు. ఘటన స్థలానికి చేరు కొని పోలీసులు యువకుడి మృతదేహం కోసం గాలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో సుమారు రెండు గంటలకుపైగా సాగర్‌గౌడ్ ఆచూకీ లభించలేదు. కెనాల్‌నీటి ప్రవాహం తగ్గించి వెతకగా కొంతదూరంలో చెట్టుకు మృతదేహం తట్టుకొని కనిపించింది. దీంతో సాగర్ మృతదేహాన్ని కెనాల్‌లో నుంచి బయటికి తీసి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెల్దుర్తి గ్రామానికి చెందిన సాగర్ జగిత్యాలలో పాలడెయిరీ నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. హోలీ సందర్భంగా తనస్వగ్రామం వెల్దుర్తికి వచ్చి వేడుకల్లో పాల్గొ న్నాడు. ఈక్రమంలోనే సాగర్ మృత్యువాతపడడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. మృతుడు సాగర్‌కు భార్య వెన్నెల, కుమా రుడు, కూతురు ఉన్నారు. ఘటనస్థలానికి చేరుకొని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ వివరాలు సేకరించారు. కేసు విచా రణ చేపట్టారు. బాధిత కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామ ర్శించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

ఇల్లందకుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామసమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం కొత్తపల్లి గ్రామానికిచెందిన అనుదీప్(17) చిన్నకోమటిపల్లి గ్రామానికిచెందిన తనస్నేహితుడి ఇంటికి వచ్చి తిరిగివెళ్తున్న క్రమంలో బైక్అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అనుదీప్ పక్కనే ఉన్న బండరాయికి తల తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


వామిక (ఫైల్)

చందుర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రానికి చెందిన మర్రి నిశాంత్-వీణ దంపతుల కుమార్తె వామిక (16నెలలు) అనే చిన్నారి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. వామిక పది రోజులనుంచి బ్లడ్ఇన్ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వామికను బతికించడం కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది.

ఏటీఎంలోకి దూసుకెళ్లిన కారు

రామగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీ ఎస్‌బీఐ ఏటీఎంలోకి టీఎస్ 22సి 3614 నంబరు గల కారు శుక్రవారం దూసుకెళ్లింది. ఏటీఎం షెడ్ గద్దెకు ఢీకొని కారు నిలిచిపోయింది. ఈ ఘటనలో కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న సింగరేణి ఉద్యోగికి ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని ఎస్ఐలు చంద్రకుమార్, దివ్య, పోలీసు సిబ్బంది పరిశీలించారు.


ఏటీఎమ్ గదిని ఢీకొని ఆగిన కారు


రుద్రవరం-గొల్లపల్లి వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

'డేంజర్ జోన్'గా మూడు గ్రామాల కూడలి

● తరచూ రోడ్డు ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న స్థానికులు
● స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

వేములవాడ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నుంచి కరీంనగర్ వెళ్లే రోడ్డు మార్గంలోని రుద్రవరం ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాంతంలో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రుద్రవరం, సంకెపల్లి, గొల్లపల్లి గ్రామాలు ఒకేచోట ఉండటంతో రోడ్డుపై జనసంచారం ఎక్కువగా ఉంటుంది. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి కరీంనగర్, వరంగల్, హన్మకొండ ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వందలాది వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. అయితే ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, గొల్ల పల్లి, అనుపురం గ్రామాలు కలిసి ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంకెపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మూలమలుపు ఉండటంతో కరీంనగ ర్ నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తున్నా రు. ఈక్రమంలో నిత్యం ఒకరు రోడ్డుప్రమాదం బారిన పడుతున్నారు. ఇటీవల గొల్లపల్లి గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి వైపు రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా అటుగా వస్తు న్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటన లో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన మరువక ముందే గ్రామానికి చెందిన తిరుపతి-స్వప్న దంపతులు రోడ్డుదాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కిందపడి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంకెపల్లి నుంచి అనుపురం వరకు స్పీడ్ బ్రేక్‌లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రాణాలతో బయటపడ్డాం..

బొల్లు తిరుపతి, గొల్లపల్లి



సంకెపల్లి గ్రామం నుంచి గొల్లపల్లికి వెళ్లే క్రమంలో బస్సు ఢీకొట్టింది. బస్సు టైర్ కిందపడి నలిగిపోయే వాళ్లం. అదృష్టవ శాత్తు తృటిలో ప్రమాదం తప్పి గాయాలతో బయటపడ్డాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల వేగా న్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..

కాచం నిఖిల్, సంకెపల్లి



రుద్రవరం, సంకెపల్లి గ్రామాల మధ్య రోడ్డు దాటుదామంటే భయం వేస్తోంది. వాహనాలు అత్యంత వేగంగా వస్తున్నాయి. వాహనాల వేగం తగ్గించేలా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.



సంకెపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు(ఫైల్)

తేనెటీగల దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన దుబ్బాక రజిత-నర్సయ్య దంపతులు, కుమార్తె సమ్మెట శ్రీజ-సమ్మెట మహేందర్ వేర్వేరు మోటార్ సైకిళ్లపై తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ గ్రామంలో జరిగే జాతరకు వెళుతున్నారు. మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామశివారులో గల కాకతీయ ప్రధాన కాల్వనుంచి వెళుతుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో నలుగురికి తీవ్రగాయాలుకాగా 108లో క్షతగాత్రులను హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ మోటార్ చోరీ

శంకరపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ గ్రామశివారులో ఎస్సారెస్పీ ఉపకాలువకు ఓ రైతు బిగించిన వ్యవసాయమోటార్ గురువారం అర్ధరాత్రిచోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికిచెందిన నాయిని శ్రీనివాస్ మొలంగూర్ గ్రామశివారులో రెండెకరాల వ్యవసాయభూమి కౌలుకుతీసుకొని సాగుచేసుకుంటున్నాడు. వ్యవసాయబావిలో అంతంత మాత్రంగానేనీరు ఉండడంతో ఎస్సారెస్పీ ఉపకాలువకు వ్యవసాయమోటర్ బిగించి వరిపొలాన్ని పారిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోటార్ పెట్టేందుకు వెళ్లగా ఉపకాలువకు బిగించిన విద్యుత్ మోటర్‌కనిపించలేదు. గురువారం అర్ధరాత్రి దొంగలు మోటర్‌నుదొంగలించినట్లు కౌలు రైతు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు.

సెల్‌ఫోన్ల దొంగకు జైలుశిక్ష

వేములవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్లు దొంగలించిన ఘటనలో ఓ నిందితుడికి ఎనిమిది మాసాల జైలు శిక్ష, 100 రూపాయల జరిమానా విధిస్తూ వేములవాడ న్యాయస్థానం తీర్పు చెప్పినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌పట్టణానికి చెందిన రాథోడ్‌బాలాజీ, వేములవాడకు చెందిన మంజీడి రాజయ్య అనే ఇద్దరినుంచి తంగళ్లపల్లికి చెందిన ఎండి ఇర్ఫాన్ రెండు సెల్‌ఫోన్‌లను చోరీ చేయగా 2024 జూన్ నెలలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదయ్యాయని తెలిపారు. రెండు కేసులలో నిందితుడిని రిమాండ్ చేశామని, విచారణ అనంతరం విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో న్యాయస్థానంలో సాక్షులను ప్రవేశపెట్టారని, ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసు వాదించగా, పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నిందితుడికి 8 నెలల కారాగార జైలుశిక్ష, 100 రూపాయల జరిమానా విధించిందని పేర్కొన్నారు.

అక్రమంగా డబ్బులు డ్రా చేసిన ఇద్దరి అరెస్టు

మంథని, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని ధర్మారం (గద్దలపల్లి) గ్రామానికి చెందిన కందుకూరి లక్ష్మి బ్యాంక్ అకౌంట్‌లోని రూ.4,49,000లను అక్రమంగా డ్రాచేసిన కేసులో సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌కు చెందిన దామెరకుంట అశోక్, గుండ్ర ప్రశాంత్ కుమార్‌ను అరెస్టు చేసిన రిమాండ్ పంపినట్లు సీఐ రాజు శుక్రవారం తెలిపారు. లక్ష్మి కుమారుడు చనిపోగా అతని అకౌంట్‌లో ఉన్న రూ. 4,49,000లను గత ఏడాది ఏప్రిల్ 25నఎస్‌బీఐ అకౌంట్‌లోకి బదిలీ చేయించుకుంది. ఈ డబ్బులను సెప్టెంబర్ 4న డ్రా చేసుకోవటానికి బ్యాంక్ వెళ్లగా అకౌంట్‌లో డబ్బులు లేవని చెప్పడంతో ఆమె మంథని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా నిందితులను గుర్తించామన్నారు. అశోక్ తన పేటీఎం యాప్‌కు లక్ష్మి బ్యాంక్ అకౌంట్ అనుసంధానం చేసి డబ్బులు డ్రాచేసుకొని ప్రశాంత్‌కుమార్ తో కలిసి కుటుంబ అవసరాలు, జల్సాలకు వాడుకున్నట్లు తెలిపారు. నిందితులు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ జాన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న నేపాల్‌కు చెందిన బహదూర్ భగత్ హత్య కేసులో నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఇంటర్నెట్ వైఫై పాస్‌వర్డ్ వివాదంలో వర్కర్స్ మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో బహదూర్ భగత్‌ను కర్రలతో కొట్టడంతో తీవ్రగాయాలవగా గురువారం మృతిచెందాడు. భగత్‌పై దాడిచేసిన ఘటనలో నిందితులు నేపాల్‌కు చెందిన జగదీష్ సింగ్, బహదూర్ శంకర్‌సింగ్, భరత్‌సింగ్, దీపక్, కృష్ణసింగ్‌ను కార్ఖానగడ్డ ప్రాంతంలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

చందుర్తి అడవిలో పులి సంచారం

చందుర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చందుర్తి, మల్యాల, తిమ్మాపూర్ పరిసర అటవీప్రాంతాల్లో పులి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయాగ్రామాల్లోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చందుర్తి, మల్యాల అటవీ క్షేత్రాధికారి ఎమ్ కలీలొద్దీన్ పేరిట సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలు,పశువుల,మేకలకాపరులు అడవిలోకి వెళ్లవద్దని, వ్యవసాయ భూములవద్ద, పొలాల చుట్టూ కరెంట్ తీగలు పెట్టవద్దని, ఎవరైనా ఏ విధంగానైనా పులికి హాని తలపెట్టాలని ప్రయత్నిస్తే చట్టరీత్యా కఠినశిక్ష విధించబడుతుందని పోస్టర్‌లో పేర్కొన్నారు. పులి సమాచారంతెలిస్తే వెంటనే తెలపాలని కోరారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి అదృశ్యం


లక్ష్మయ్య(ఫైల్)

కమాన్‌పూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం అల్లీపూర్(రేగడిమద్దికుంట)గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు నముండ్ల లక్ష్మయ్య మంగళవారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. గోదావరిఖని పట్టణంలోని సింగరేణి సంస్థ 7ఎల్ఈపీ బొగ్గు గనిలో పనిచేస్తు 2013లో పదవి విరమణ పొందాడు. అనంతరం సొంతూరు అల్లీపూర్‌లో స్థిరపడ్డాడు. ఇటీవల అతనిభార్య మరణించడంతో అల్లీపూర్‌నుండి కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంటలోని కూతురు పులిపాక పుష్ప ఇంటికి పదిహేను రోజుల క్రితం వచ్చాడు. మార్చి 11న మంగళవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు కమాన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీతెలిసిన వారు నంబర్‌కు 87126 56523కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల నంబర్లు 7981756443చ 79895 74705లలో కూడా సమాచారం ఇవ్వాలని కోరారు.

మాజీ సర్పంచ్ అదృశ్యం: కేసు నమోదు


దేవక్క(ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామ మాజీసర్పంచ్ పూదరి దేవక్క(72) అదృశ్యం అయినట్లు కోరుట్ల పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. దేవక్క శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. దేవక్క కొన్నిరోజులుగా మతి స్థిమితం కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి ఎస్ఆర్ఎస్పీ ప్రధాన కాల్వ వద్ద దేవక్క పర్సు తోపాటు ఆమె చెప్పులు లభించినట్లు సమాచారం. పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు.

బైక్ నడిపి ప్రమాదానికి కారణమైన బాలుడిపై కేసు

కథలాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బైక్ నడిపి ఇద్దరిని గాయపరిచిన బాలుడు, అతనికి బైక్ ఇచ్చిన తండ్రిపై కేసునమోదు చేసినట్టు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... కోరుట్లకు చెందిన బొజ్జరాజేశం తనభార్యతో కలిసి వేములవాడకు వెళ్తుండగా సిరికొండకు చెందిన ఓబాలుడు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో భార్యాభర్తలకు తలకు,కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు సిరికొండకు బాలుడు, అతని తండ్రిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. అసెంబ్లీలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డిని శాసనసభ సమావేశాల వరకు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వెంటనే సస్పెన్స్‌ను ఉపసహరించుకోవాలని సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎలాంటి అనుమతి లేకుండా వాహనదారులను అడ్డుకొని వారికి ఇబ్బంది కలిగించిన ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసి ధర్నా చేసిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై శుక్రవారం కేసు నమోదు చేశామని తెలిపారు.

పాముకాటుతో పాడి గేదె మృతి

కథలాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరులో బాస గంగారెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె శుక్రవారం పాము కాటుతో మృతి చెందింది. గంగారెడ్డి గేదెను పశువుల కొట్టంలో ఉంచి ఉదయం మేత వేసి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం పశువుల కొట్టం వద్దకు వెళ్లి పాము కాటుతో గేదె మృతి చెందినట్లు గుర్తించాడు. గేదె మృతితో రు.80 వేల నష్టం జరిగిందని బాధిత రైతు విలపించాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గుండారపు గంగాధర్ కోరారు.

వ్యభిచారం కేసులో ఇద్దరి అరెస్ట్

వేములవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో పట్టణానికి చెందిన రత్నయ్య, లాడ్జి ఓనర్ విజయ్ కుమార్‌తో కలిసి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఓ విటుడుతో పాటు నిర్వాహకుడు రత్నయ్యలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రత్నయ్యను శుక్రవారం రిమాండ్‌కు తరలించగా, విజయ్‌కుమార్ పరారీ ఉన్నాడని తెలిపారు.

మానేరు వంతెన పైనుంచి పడి యువకుడికి గాయాలు

ఓదెల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల మానేరు వంతెన పైనుంచి పడి రామగిరి మండలం కాసిపల్లికి చెందిన అబ్బు కార్తీక్ రెడ్డి అనే యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. హన్మకొండ నుంచి సొంత గ్రామమైన కాసిపేటకు ద్విచక్ర వాహనం పై వేగంగా వస్తుండగా పక్కనున్న డివైడర్‌కు ఢీకొనడంతో పైనుంచి మానేరు వాగులో పడిపోయాడు. ఈ సంఘటనలో తీవ్రగాయాలకు గురైన కార్తీక్ రెడ్డిని 108లో జమ్మికుంటలోని హాస్పిటల్‌కు తరలించారు.

థాయ్‌లాండ్‌కు పంపిస్తానని చెప్పి మోసం చేసిన ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట థాయ్‌లాండ్ పంపిస్తానని మోసం చేసిన హైదరాబాద్‌లోని వనస్థలిపురం సమీపంవద్ద గల ఎస్‌కేడీనగర్‌కు చెందిన బొమ్మ రఘువసంత్ కుమార్ (32), దాసరి ఎక్నాథ్‌గౌడ్(29) అనేఇద్దరు ఏజెంట్లను శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం వెంకంపేటకు చెందిన కల్ల అరవింద్ అనే నిరుద్యోగ యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ఇద్దరు ఏజెంట్లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఎవరూ గుర్తుతెలియని ఏజెంట్లను, మధ్యవర్తులను నమ్మి డబ్బులు వృథా చేసుకోవద్దని, విదేశాలకు వెళ్లాలనుకునే వారుంటే లైసెన్స్‌డ్ ఏజెంట్లని సంప్రదించాలన్నారు. కంపెనీ వీసాపై మాత్రమే వెళాలని, ఫ్రీవీసాపై వెళితే ఇబ్బందులు పడుతారని తెలిపారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకోవాలి

● మెట్‌పల్లిలో పోలీసులకు ఎన్ఎస్‌యూఐ నాయకుల ఫిర్యాదు


ఎస్సై కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మెట్‌పల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించపరిచేలా సోషల్‌మీడియాలో బీఆర్ఎస్వీ నాయకుల పోస్టుల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మెట్‌పల్లిలో పోలీసులకు ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీర్కుల విజయ్ ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కిరణ్ కుమార్‌ను కలిసి ఫిర్యాదుపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిని అగౌరవ పరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్వీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ బీర్కుల విజయ్‌తోపాటు వైస్ ప్రెసిడెంట్ పోల్కం శివ, నాయకులు సమీర్ సర్కార్, ఖాజా అజీం, వాల్గొట్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన గుడిసె: తప్పిన ప్రమాదం

సారంగాపూర్, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): పూరి గుడిసె కూలడంతో అందులో నివాసం ఉంటున్న కుటుంబానికి ప్రమాదం తప్పింది. సారంగాపూర్ మండలకేంద్రానికి చెందిన తునికిచారి నివాసముండే పూరిగుడిసె శుక్రవారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని అధికారులను, ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా వేడుకున్నాడు.


కూలిన గుడిసె

వేములవాడలో ఘనంగా డోలోత్సవం



స్వామివారికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో డోలోత్సవం ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించిన అర్చకులు వేదమంత్రాల మధ్య వైభవంగా డోలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రాజన్నను దర్శించుకున్న మంత్రి సతీమణి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదబ్రాహ్మణులు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కొండగట్టు గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా భక్తులు కొండగట్టు గిరి ప్రదక్షిణను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరుకు చెందిన సురేశ్ ఆత్మారాం శర్మ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరిప్రదక్షణ నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో సాగింది. వందలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ప్రదక్షిణ ముగిసిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

డ్రైవింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డ్రైవింగ్ కోర్సులో ఉచిత శిక్షణకు ఆసక్తి ఉన్న బీసీ యువతీ, యువకులు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ బీసీ యువతీ యువకులకు హెవీ మోటార్ వాహనం, తేలికపాటి మోటార్ వాహనం డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తారన్నారు. హకీంపేటలో 38 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు లైసెన్స్ అందిస్తామని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజనం వసతి సౌకర్యం ఉంటుందన్నారు. హెవీ మోటార్ వెహికల్‌కు 20 నుంచి 45, తేలికపాటి మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు 18 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, లెర్నింగ్ లైసెన్స్‌తో ఈనెల 15 నుంచి 31 సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

సాగునీటి కోసం రైతుల నిరసనదీక్ష

ఇల్లంతకుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష కొనసాగుతోంది. ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తి చేయాలని చేపట్టిన నిరసనదీక్ష శుక్రవారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న మహిళా రైతులు మాట్లాడుతూ అందురూ హోలి వేడుకల్లో పాల్గొంటుండగా.. పంటలు ఎండిపోతున్న తాము మాత్రం నిరాహారదీక్షలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించవలసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాలువ పనులు పూర్తిచేసే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు చెందిన మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువ వికాసం
స్వయం ఉపాధికి ఊతం



యువత కోసం రాష్ట్ర ప్రభుత్వ పథకం

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఆర్థిక స్వావలంబన సాధించేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయమందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయబోతోంది.

ప్రయోజనాలు

ఒక్కో లబ్ధిదారుకు గరిష్ఠంగా మూడు లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయమందిస్తారు. ఈ మొత్తంతో చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు ప్రారంభించవచ్చు. ఎక్కువ మంది యువత ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంతంగా ఆదాయ మార్గాలను సృష్టించుకోవచ్చు. నిరుద్యోగ యువత స్థిరమైన ఆదాయం పొందడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడి వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది.

పథకం అమలు ఇలా

ఈ పథకానికి అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అర్జీదారులు తమ యూనిట్లకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సమర్పించాల్సి ఉంటుంది. సంబంధిత కార్పొరేషన్‌తోపాటు కలెక్టర్ల పర్యవేక్షణలో మండల స్థాయిలోని అధికారుల కమిటీ లబ్దిదారులను ఎంపిక చేసి తుది జాబితా ప్రకటిస్తుంది. అర్హుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లాల్లో 16,800 మందికి లబ్ధి

రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల మందికి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి సుమారు 4,200 మందికి లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది కరీంనగర్ జిల్లాల్లోని నాలుగు నియోజకవర్గాల్లో సుమారు 16,800 మందికి ఆర్థిక సాయం అందనుంది.



ముఖ్యమైన తేదీలు

నోటిఫికేషన్ విడుదల : మార్చి 15
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం : మార్చి 15
చివరి తేదీ : ఏప్రిల్ 5,
లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ : ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు
మంజూరు పత్రాలు అందించడం : జూన్ 2 (తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం)

బోనాల జాతరకు వేళాయె...

● ముస్తాబైన పెద్దాపూర్ మల్లన్నస్వామి ఆలయం ● ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



పెద్దాపూర్ మల్లన్న స్వామి ఆలయం

మెట్‌పల్లి రూరల్, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతరకు ఆలయం ముస్తాబైంది. గ్రామం మధ్యలో మల్లన్న స్వామి వెలిశారు. ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. మల్లన్న స్వామి జాతరలో పాల్గొనడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. జాతర కోసం గ్రామస్థులు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు వారం రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు.

● నేటి నుంచి జాతర

జాతర 15న ప్రారంభమై 18న ముగియనుంది. 60 వేల నుంచి 70వేల మంది భక్తులు స్వామి వారికి బోనాలు సమర్పిస్తారు. శనివారం ఉదయం ఆలయంలోని ఉత్సవ మూర్తులను ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి సమీపంలోని గోదావరికి తీసుకెళ్తారు. అక్కడ గంగా జలంతో స్వామి విగ్రహాలకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం తిరిగి ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకువస్తారు. అదే రోజు రాత్రి స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచి మల్లన్న స్వామి, శివలింగాన్ని భక్తులు దర్శించుకుంటారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తి శ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేస్తారు. బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పిస్తారు అనంతరం స్వామి వారిని ప్రత్యేక రథంఆలయం చుట్టూ తిప్పి బోనాల పండుగను ముగిస్తారు.

● అందరి సహకారంతో జాతర నిర్వహిస్తున్నాం

- మిట్టపల్లి నారాయణరెడ్డి,
పెద్దాపూర్ మల్లన్న స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్



ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను జరపడం ఆనవాయితీ. ఈ జాతరను అధికారులు, గ్రామస్థుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నాం. మూడు రోజులు జరిగే జాతర ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. జాతర కోసం వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రజలను చైతన్య పరిచే రచనలతోనే పాలకుల్లో మార్పు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూకంటి జగన్నాథం

ఎల్లారెడ్డిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరిచే రచనలతోనే పాలకుల్లో మార్పు వస్తుందని అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం అన్నారు. ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్‌లో 1997-1998 పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో జర్నలిస్టు మంగురపు విష్ణుప్రసాద్ రచించిన 'తెగమురిసే మేక' కవితా సంకలనం పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూకంటి జగన్నాథం మాట్లాడుతూ ప్రజలు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజహితాన్ని కోరేది కవిత్వమని అన్నారు. సిరిసిల్లలో బీసీల జనాభా అధికంగా ఉన్నా ఎమ్మెల్యేలు కాలేకపోవడానికి కారణం చైతన్యం లేకపోవడమేనని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్‌కు నేటికీ సిరిసిల్లలో ఓటు హక్కు లేకపోవడం ఈప్రాంత ప్రజల్లో ఉన్న చైతన్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలు మేకల్లా మారినంత కాలం పాలకులు మోసం చేస్తూనే ఉంటారన్నారు. అనంతరం విష్ణుప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, ప్యాక్స్ చైర్మన్, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వివేక రచయితల సంఘం ప్రతినిధి పర్శరాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు మళ్లీ గండి

● రు. 20 లక్షలతో మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం
● చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు ప్రశ్నార్థకం



కోనాపూర్ శివారులో రాళ్లవాగు కాలువకు ఏర్పడ్డ గండి

కథలాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు మళ్లీ గండి పడింది. ఏటా నీటి ప్రవాహానికి నక్కల ఒర్రె ప్రాంతంలో గండి పడి చివరి ఆయకట్టుకు రైతులకు పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో గండి పడుతున్న ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన సిమెంట్‌తో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి 20 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. కట్టడం పక్కన మొరం పూర్తి స్థాయిలో వేయకపోవడం వల్ల కొద్దిపాటి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిందని రైతులు అంటున్నారు.

● రైతులకు తప్పని కష్టాలు

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ గుట్టల్లో రాళ్లవాగు ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా నిర్మించారు. మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి, కథలాపూర్ గ్రామాల్లోని 30 వేల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందుతుంది. నక్కల ఒర్రె ప్రాంతంలో కాలువ ప్రమాదకరంగా ఉండడంతో తరచూ తెగిపోతోంది. అక్కడ వంతెన మాదిరిగా శాశ్వతంగా నిర్మాణం చేపట్టినా పక్కన బలంగా మొరం వేయకపోవడంతో కోసుకుపోయింది. దీంతో భారీ గొయ్యి ఏర్పడి నీరంతా వాగులోకి వృథాగా పోతోంది. రెండు జిల్లాల పరిధిలో ఈ కాలువ పరిధి ఉండడంతో ఇరిగేషన్ అధికారులకు పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. మరమ్మతుల విషయంలో రెండు జిల్లాల అధికారులు కలసి అంచనాలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నిధుల మంజూరుకు ఆటంకాలు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

● రూ. 50 లక్షలతో అంచనాలకు ఎమ్మెల్యే ఆదేశం

- వాకిటి రాజరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్



గండి పడ్డ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రైతులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్ చేపట్టిన పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. వంతెన పక్కన మొరం వేయకపోవడం వల్లే గండి పడిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కమ్మర్‌పల్లి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే 50 లక్షల రూపాయలతో కాలువ పూర్తిస్థాయి మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రాజెక్టును ఒకే జిల్లా అధికారుల పరిధిలోకి వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను కోరాం.

కన్నుల పండువగా నృసింహుడి తెప్పోత్సవం

దోలోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

తిలకించిన వేలాది మంది భక్తులు



ధర్మపురి బ్రహ్మపుష్కరిణి (కోనేరు) వద్ద భక్తులు

ధర్మపురి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీ నృసింహస్వామి (యోగ) తెప్ప, డోలోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితుడు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఉత్సవమూర్తులను సేవలపై ఆశీనులు చేసి ఆలయం నుండి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వరకు తీసుకువచ్చారు. స్వామి వారల సేవలను హంస రూపంలోని వాహనంపై ఉంచి బ్రహ్మ పుష్కరిణి నీటిలో బోయలు ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామివారల సేవలను పుష్కరిణి మధ్య ఉంచి మండపంలోని ఊయలపై డోలోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్తర ద్వారం లోనికి ప్రవేశించి స్వామి వారిని దర్శించుకున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పలువురు ఎస్ఐలు, బందోబస్తులో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్పం తిరుపతి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భారీగా తరలివచ్చి గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఉగ్ర నారసింహుని ఆలయం వద్ద వల్లుబండ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారలకు ప్రీతి అయిన పట్టె నామాలు, కోరె మీసాలు సమర్పించారు. ఆర్థిక సౌభాగ్యం కోసం కుబేరుడికి, కష్టాలు తొలగి పోవాలని కోరుతూ నాగ దేవతకు, సకల సంపదల కోసం నృసింహుడికి మహిళలు కుంకుమ పూజలు జరిపారు. ఆలయం పక్షాన సుమారు 15 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది తగు సేవలు అందించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్, ఎస్ఐలు, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలగవ రోజు ఆలయానికి రూ. 5,11,031 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ. 1,85,465 ప్రసాదాలు విక్రయించగా రూ. 2,80,500 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ 45,066 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సల్లో భాగంగా 15న శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ కొత్త (ఉగ్ర) లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై నృత్య ప్రదర్శన ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.









ధర్మపురి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో తెప్పోత్సవం, డోలోత్సవాలను తిలకించేందుకు హాజరు అయిన భక్తులు, స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పెద్దపల్లిలో చిన్నారుల హోలీ సంబరాలు



గోదావరిఖనిలో హోలీ ఆడుతున్న చిన్నారులు



ధూళికట్టలో చిన్నారుల హోలీ వేడుకలు



కాల్వశ్రీరాంపూర్ హోలీ వేడుకల్లో యువకులు



మంథని హోలీ వేడుకల్లో యువకుల నృత్యాలు



హోలీ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, చిన్నారులు



వడుకాపూర్ హోలీ వేడుకల్లో యువకులు

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ యువతీ యువకులు కేరింతలు కొట్టారు. చిన్నారులు కలర్ నీళ్లతో ఒకరిపై ఒకరు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. ప్రభుత్వ ఐటీఐ మైదానంలో వాకర్స్ హోలీ వేడుకలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకుడు సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమాన్ రోడ్డువద్ద బీజేపీ, బీజేవైఎం, భజరంగ్‌దల్ నాయకులు రంగులు చల్లుకొని హోలీ సంబరాలు పంచుకున్నా రు. జెండా కూడలిలో యువతీ యువకులు మా ర్వాడి మహిళలు హోలీ సంబరాలు ఉత్సా హంగా జరుపుకున్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీలో వాడ వాడలా చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రం గులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఎన్టీపీసీ పీటీఎస్, కృష్ణానగర్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు లో యువకులు హోలీ రంగుల్లో మునిగి తేలారు. టీటీఎస్‌లోని గోదావరిభవన్‌లో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు సంబరాల్లో పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో హోలీ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ఉదయం నుంచి పిల్లలు, యువకులు హోలీ వేడుకలు జరుపుకొని ఒకరిపై ఒక్కరు రంగులు చల్లుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లు కొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మంథని: మంథనిలో హోలీ వేడుకలు వైభవంగా జరిగాయి. నాయకులు వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. యువకులు, చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. దీంతో వీధులన్నీ సందడిగా కన్పిం చాయి. చౌరస్తాలో యువకులు ఒకరిపై ఒకరు రంగులతో పాటు కోడి గుడ్లు, టమాటాలు కొట్టుకుంటూ కేరింతలు కొట్టారు. ప్రభుత్వ జూని యర్ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు జరుపుకున్నారు. రావికంటి మనోహర్, అంకరి కుమార్, రమేష్, సతీష్, ఐలి రవి పాల్గొన్నారు. గోదావరి నది తీరానికి వెళ్లి స్నానాలు చేశారు.

మంథని రూరల్: మండలంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు, పెద్దలు, చిన్నారులు పురవీధుల గుండా తిరుగుతూ రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువత డప్పు చప్పుళ్ళ మధ్య నృత్యాలు చేస్తూ కేరింతలు మధ్య వేడుకలునిర్వహించారు.

ముత్తారం: మండలంలో హోలీ సంబరాలు నిర్వహించారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలి పారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రామగిరి: మండలంలో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సింగరేణి అధి కారులు వేడుకల్లో పాల్గొన్నారు. ఎస్ఐ చంద్రకు మార్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు.

జూలపల్లి: హోలీ వేడుకల్లో యువతీ యువ కులు, చిన్నా రులు, మహిళలు పాల్గొన్నారు. ఒకరి పైనొకరు రంగులు చల్లుకున్నారు. పెద్దాపూర్‌లో ఉపాధిహామీ కూలీలతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హోలీ పండుగను జరుపుకున్నారు.

ధర్మారం: మండలంలో హోలీ వేడుకలు వైభవంగా జరి గాయి. యువతీ యువకులు రంగులు చల్లుకున్నారు. వాసవి క్లబ్ ఆధ్వ ర్యంలో వేడుకలు నిర్వహించారు. బొమ్మరెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగా గురూ జంగిలి సుధాకర్ ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో హోలీ జరు పుకున్నారు.

పెద్దపల్లి రూరల్/ఓదెల: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఉదయం నుంచి చిన్నారులు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కమాన్‌పూర్: బస్టాండ్ ఆవరణలో హోలీవేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగులు జల్లుకొని చిన్నారులు, మహిళలు సంబరాలు జరుపుకున్నారు. యువతీ, యువకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: హోలీ పండగను పట్టణ, మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుం టూ సంబరాలు జరుపుకున్నారు. వైశ్యా భవన్‌లో మహిళలు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుని సంబరాలు చేసుకున్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

కళ్యాణ్‌నగర్ /మార్కండేయకాలనీ: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో హోలీ వేడుకలు ఆనందోత్సవాల మధ్య జరిగాయి. కాలనీల్లో చిన్నా పెద్దా రంగులు చల్లుకున్నారు. బైక్‌లపై షికార్లు చేసుకుంటూ, కోడిగుడ్లు కొట్టుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చౌరస్తాలోని వైట్ హౌస్ వద్ద హోలీ సంబరాలు నిర్వహించారు. పలుపార్టీల నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు దీటి బాలరాజు ఆధ్వర్యంలో హోలీ వేడుకలు జరిగాయి. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. మార్కండేయకాలనీలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకలకు కందుల సంధ్యారాణి పాల్గొన్నారు. బీఎంఎస్ నాయకుడు యాదగిరి సత్తయ్య ఆధ్వర్యంలో చౌరస్తాలో హోలీ వేడుకలను నిర్వహించారు.

కోల్‌సిటీ : కమిషరేట్‌లో హోలీ సంబరాల్లో సీపీ అంబర్ కిశోర్ ఝా పాల్గొన్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ సీపీకి రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. డప్పు నృత్యాలతో కమిషనర్, అధికారులు, సిబ్బంది హోలీ వేడుకల్లో నృత్యాలు చేశారు. హోలీ పండుగ జీవితాలను రంగుల మయం చేయాలని ఆకాంక్షించారు. సీపీ చిన్న పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులో హోలీ వేడుకలో యువకులు



సుల్తానాబాద్‌లో హోలీ వేడుకలు



ఓదెలలో యువకుల సంబరాలు



కమాన్‌పూర్ హోలీ వేడుకల్లో మహిళలు

బీఆర్ఎస్ నాయకుడి ఇఫ్తార్ విందు

సుల్తానాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సి పాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు మాజీ కౌన్సిలర్ గొట్టం లక్ష్మీ మల్లయ్య ముస్లింలకు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నివాసంలో ఏర్పాటు చేసిన విందులో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీ పీ బాలాజీరావు, గొట్టం మహేష్, అంజయ్య పటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్, నాయకులు పారుపల్లి గుణపతి, గోపి, సర్వర్, తాహర్, సాజీద్, సాగర్ రాజు పాల్గొన్నారు

శ్రీరామ ఆటో యూనియన్ కార్యవర్గం

ఎలిగేడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలోని శ్రీరామ ఆటో యూనియన్ కార్యవర్గ ఎన్నికలు శుక్ర వారం హోలీ పండుగ సందర్భంగా నిర్వహించారు. శ్రీరామ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కీర్తి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గోసిక అంజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా డోలోత్సవం

మంథని, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగను పురస్కరించుకొని సీలేశ్వర-సిద్దేశ్వరాయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో డోలోత్సవాన్ని శుక్రవారం రాత్రి భక్తులు వైభవంగా నిర్వహించారు. శివాలయంలో శివపార్వతుల, వైష్ణవ ఆలయంలో లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు డోలోత్సవం జరిపారు. విగ్రహాలపై కలశంలోని రంగునీళ్ళు చల్లారు. శివరాత్రి రోజున జరిగే ఉమా-మహేశ్వరుల కల్యాణోత్సవం అనంతరం వచ్చే హోలీ పండగ సందర్భంగా డోలోత్సవం ద్వారా 16 రోజుల పండగను లోకే కుటుంబ సభ్యులు నిర్వహించడం అనాదిగా వస్తోంది. వేద పండితులు మారుతిశర్మ, పూజారి దహగం రమేష్‌అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజాపాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారు



గోపాల్‌రావుపేట వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మన్ కుమార్, గడ్డం వివేక్

ధర్మారం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌లు అన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాల్‌రావుపేట, దొంగతుర్తి గ్రామాలలోని వేంకటేశ్వర స్వామి దేవాలయాలను దర్శించుకొని ప్రత్యే పూజలు నిర్వహించారు. నర్సింహులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో శాసనసభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం ధర్మారం మండల కేంద్రంలో హోలీ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని ప్రజలను ఇబ్బంది పెట్టిందని, ఈ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. మార్కెట్ చైర్మెన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, బ్లాక్ 2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కొడారి హన్మయ్య, దేవి జనార్దన్, పాలకుర్తి రాజేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

పెద్దపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని గురువారం అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తా రోకో చేశారు. దీంతో కొద్దిసేపు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజుకుమార్ మాట్లాడుతూ ఇది ప్రజాపాలన కాదని, నియంతృత్వ పాలన అని, బీఆర్ఎస్ పార్టీ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ తీరును ప్రజలు నిరసిస్తున్నారన్నారు. అసెంబ్లీలో మాట్లాడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదన్నారు. నూనేటి సంపత్, మోహన్‌రావు, సలెంద్ర రాములు, చంద్రశేఖర్, లైశెట్టి బిక్షపతి, కార్తీక్ పాల్గొన్నారు.



పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మారం, మార్చి14 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ధర్మారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈరవేణి రాజుకుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన సౌజ్ఞశ్రీ, ఉషాలు రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగంలో ఫుట్‌బాల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుఫున తలపడనున్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు కొమురయ్య, మేకల సంజీవరావు, అభినందించారు.

విద్యార్థులను అభినందించిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో సెక్టార్-3 సింగరేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. యూనిఫైడ్ కౌన్సిల్ సంస్థ జనవరి 30న పరీక్ష నిర్వహించగా 83 మంది హాజరయ్యారు. వీరిలో ఎనిమిది మంది గోల్డ్‌మెడల్ సాధించారు. విద్యార్థులను ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అభినందించారు.

రైతులకు త్వరితగతిన విద్యుత్ కనెక్షన్లు

- మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి - ఎన్పీడీసీఎల్‌లో పరిధిలో జిల్లాలో తక్కువ దరఖాస్తులు పెండింగ్



పెద్దపల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ఎన్పీడీసీఎల్ చర్యలు తీసుకుంటోంది. రైతులు కార్యాలయాల చుట్టు తిరగకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు వెసలుబాటు కల్పించింది. దరఖాస్తు ప్రక్రియ ఎక్కడ ఉందనేది సెల్ ఫోన్‌లో స్టేటస్ తెలియజేసే విధానం తీసుకువచ్చారు.

ఎన్పీడీసీఎల్ పరిధిలో 16 జిల్లాలున్నాయి. పెద్దపల్లి జిల్లాలో 73,800 వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. కొత్తగా కరెంటు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొన్న రైతులకు పంటల పరిస్థితులు చూసి మూడు నెలల్లో కనెక్షన్ ఇస్తున్నారు. పంటలు వేసి ఉంటే కోతలు పూర్తయ్యాక కనెక్షన్లు ఇస్తారు. మీ సేవలో కరెంటు కోసం దరఖాస్తు చేసుకున్న రైతు సెల్‌ఫోన్‌కు మెస్సెజీల రూపంలో పని ఎంత వరకు వచ్చిందనే సమాచారం అందిస్తున్నారు. రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సామగ్రి కోసం స్టోర్ చుట్టు తిరగకుండా ఈ స్టోర్ విధానం ప్రవేశపెట్టి కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని మెటీరియల్‌ను తీసుకుంటున్నారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వర్నాటి వరుణ్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈ విధానాలు అమలులోకి వచ్చాయి. పేపర్ పని లేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం ఉంది. క్షేత్ర స్థాయిలో పని చేసే విద్యుత్ అధికారులకు సమయం ఆదా అవడంతో పాటు రైతులకు వ్యవసాయ సర్వీసుల మంజూరు చకాచకా జరుగుతోంది. ఎన్పీడీసీఎల్ పరిధిలో తక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో జిల్లా ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 950 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. వేసవిలో పంటలు కోత తరువాత కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. వేసవిలో కరెంటు కొరత, లోపవర్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటి వరకు 200 ట్రాన్స్‌ఫార్మర్లు వేయాల్సిందిగా గుర్తించారు. హై కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లు వేసి కరెంట్ సమస్యను పరిష్కరించనున్నారు. ఇందులో 63 ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పటికే బిగించారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం



ఎస్ఈ కంకటి మాధవరావు

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. సమస్యలు తలెత్తినా, కొత్త కనెక్షన్లు కావాలన్నా స్టోర్‌లో జిల్లాకు సరిపడా మెటిరియల్ ఉంది.

కాలువ నీళ్ళకు పంటలు పండించా



కంది శివారెడ్డి

కాలువ నీళ్ళతో పంట పండించా. పంటలు ఎండిపోవడంతో బోరు వేసి కొత్త కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న మూడు నెలల్లోనే కరెంటు కనెక్షన్ ఇచ్చారు

కనెక్షన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగేది



భవనం జయరామిరెడ్డి

గతంలో కనెక్షన్ కోసం నెలలు, ఏళ్ళ తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగాల్సి వచ్చేది, మెటిరీయల్ నిల్వ లేదని ఆలస్యం జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

పాఠశాలల్లో సాంకేతిక పద్ధతిలో విద్యాబోధన

ఎలిగేడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించేందుకు ప్రభుత్వం ఐఎఫ్‌పీ (ఇంట్రాక్టివ్ ఫౌండేషన్ ప్రోగ్రాం) విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. పాఠాంశాలను అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో ఉండే విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రదర్శించి సులభంగా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థులు ఉన్నత విద్యపై నైపుణ్యం పెంచుకునేందుకు ఐఎఫ్‌పీ విద్యాబోధన విధానాన్ని అమలు చేస్తున్నారు. మండలంలోని ధూళికట్ట, సుల్తాన్‌పూర్, ఎలిగేడు పాఠశాలల్లో మన ఊరు-మన బడి ద్వారా ఒక్కొక్క పాఠశాలకు సుమారు రూ.18లక్షలు వెచ్చించి ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌లను మంజూరు చేసింది.

విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు పలు విషయాలను ఐఎఫ్‌పీ పద్ధతి ద్వారా ప్రత్యక్ష ప్రదర్శనతో అందిస్తున్న బోధన దోహదం చేస్తోంది.సైన్స్‌లోని మానవశరీర అవయవాల పనితీరు, రక్తప్రసరణ, కండరాల వ్యవస్థ, ఖగోళ శాస్త్రంలోని భూపరిభ్రమణం, గ్రహణాలు తదితర అంశాలను వీడియోలు, యానిమేషన్ చిత్రాలను ప్యానెల్ బోర్డుపై బోధిస్తున్నారు.

ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలి

దేవేందర్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం

ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా విద్యార్థులకు సులభమైన పద్ధతిలో విద్యబోధన సాధ్యపడుతుంది. ఏడాది కాలంగా ఇంటర్‌నెట్ సదుపాయం లేకుండానే సెల్‌కు అనుసంధానం చేస్తున్నాం. వచ్చే విద్య సంవత్సరం నుండి ఇంటర్‌నెట్ సదుపాయం ఏర్పాటుచేయాలి

ఐఎఫ్‌పీతో సులభతరం

నరేంద్రాచారి(ఎంఈవో)

విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకునే విధంగా ఉంది. సులభంగా అర్థమయ్యే విధానం ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు ఉపయోగ పడుతుంది.